వ్యాస కౌముది



## రామాయణంలో స్త్రీ పాత్రలు - ౨

- ప్రమీలా చంద్రమోహన్

### సుమిత్ర

సుమిత్ర అన్వర్థ నామధేయురాలు. అందరికీ మిత్రురాలు. మహా మంచి మనిషి. ఎవరినీ ఎందుకూ తప్పుపట్టని సాధ్వి. అందరిలో మంచిని చూచే మంచి వ్యక్తి. గుణశీలురాలు.

సుమిత్ర మగధ దేశపు రాజు కూతురు. ఈమె లక్ష్మణ, శత్రుఘ్నుల కన్నతల్లి. పుట్టింది కవలలైనా ఒక్కరూ ఆమె దగ్గర పెరగలేదు. లక్ష్మణుడు కౌసల్య దగ్గర, శత్రుఘ్నుడు, భరతుని అంటి పెట్టుకుని భరతుని మేనమామల వద్దవున్నా, బిడ్డల భాతృవాత్సల్యానికి సంతసించిందే కాని, పరితపించలేదు. ఆమె అనుక్షణం బిడ్డల అభివృద్ధిని కోరిందేగాని తనకై పరితపించలేదు. ముప్పురు రాణులలో రెండవ రాణి. పెద్ద భార్యవలె గౌరవంగాని, కైకవలె ముద్దు, ముచ్చటలు గాని ఎరుగనిదైనా, వారి ఎడల అచ్చమైన ప్రేమ చూపిందిగాని అసూయ ఎరుగదు.

కైక వరాలు కోరి రాముని వనవాసానికి పంపమని కోరినదన్నప్పుడు, అందరూ కైకను నిందలాడినా, సుమిత్ర మాత్రము ఏదో తెలియరాని దైవము ఆమెని అలా ప్రేరేపించినదన్న నిజము గ్రహిస్తుంది. ఆమె రాముని మీద నిజమయిన ప్రేమకలది. రామునితోడుగా లక్ష్మణుడు వెడతానంటే నిండు హృదయంతో ఆశీర్వదిస్తుంది. పెద్దలందరితో ఆమె మంచిదనము పొగడబడుతుంది. కైకమ్మ తన బిడ్డకయి రాముని అరణ్యాలకు పంపితే, సుమిత్రమ్మ తన బిడ్డడని రాముని కొరకు త్యాగం చేస్తోందని.

ఆమె కొడుకుని ప్రేమతో గుండెలకు హత్తుకుని నీతులు చెపుతుంది. లక్ష్మణుని కార్యం గురుతరమయినదని, అనురక్తితో అన్నవెంట అడవులకు పోయేవానికి దేవతలు అనుకూలిస్తారని చెపుతుంది. కోడలి అంతఃతపశ్శర్య పెట్టని రక్షగా కొడుకుని కాపాడుతుందని చెపుతుంది. తను సీతా, రామ, లక్ష్మణుల క్షేమం కోసం ఉపవాస దీక్షతో ఆ పరాశక్తిని ఆరాధిస్తానని చెపుతుంది. అన్న, వదినల సేవతో అప్రమత్తుడవయి మెలగమని, అది సనాతన ధర్మమని, ఆ ధర్మం లక్ష్మణునిలో పరాకాష్టకు చేరుకుందని చెపుతుంది.

'ఏది జరిగినా మన మంచికే' అని అంటారు పెద్దలు. తెలియక దైవ దూషణము, పరుల దూషణము చేయకూడదు ఏ సమయంలోనూ ఇది మరచిపోవద్దు.

'రామం దశరథ విద్ధి, మాంవిద్ధి జనకాత్మజాం
అయోధ్యా మటవీం, గచ్ఛతాత, యధాసుఖమ్?'

సీతా, రాములను తల్లితండ్రులుగా, అడవి అయోధ్యగా, వచ్చిన సుఖాలు వచ్చినట్లు అనుభవించమని చెపుతుంది. సీతాదేవిని దీర్ఘసుమంగళిగా జీవించమని దీవిస్తుంది.

ఆమె మహాయోగిని. శ్రీరాముని చేత తన పినతల్లి విరాగిణి అని అనిపించుకుంటుంది. అడుగడుగునా లక్ష్మణుని ప్రవర్తనలో ఆమె శిక్షణ గోచరిస్తుంది. అందుకే అతనిని సౌమిత్రి అన్నారు. వనవాస ప్రారంభ సమయంలో ఆమె లక్ష్మణునకు సూక్ష్మ రూపంలో కనిపించి, సీతా, రాముల సేవల అలసత్వం కూడదని, నిద్రనుపూర్తిగా విసర్జించవలసినదని, రాముడు మేల్కొని చూస్తే, నిద్రిస్తున్నట్లు కనిపించగలవనీ, వరం ఇస్తుంది. సీతా, రాముల సేవలో, అడుగడుగునా లక్ష్మణునకు సరియైన హెచ్చరికలు చేస్తూ ఉంటుంది.

కౌసల్య రాముని వనవాసానికి పంపినందుకు పతిని తూలనాడుతుంటే, ఆమెని సన్మార్గానికి తిప్పుతుంది. ఇప్పుడు పతిని దూషించటము కాదు, పతిసేవ అని హెచ్చరిస్తుంది. మనసు చెడివున్న పతిని స్వస్థుని చేయవలసిన బాధ్యత తమదేనని గుర్తుచేస్తుంది. ఇంకా కౌసల్యతో ఆమె అందరు తల్లుల వంటిది కాదని, రాముడు గుణసముద్రుడు, అపరాజితుడు, పురుషోత్తముడు, అతనికోసం దుఃఖించుట పాడిగాదని, తండ్రిని సత్యవాదిని చేయు వనవాసం రామునిదని, భర్త సత్యవంతుడయితే సగం ఫలం తమకు వస్తుందని ధైర్యం చెపుతుంది.

అప్రమాద బుద్ధి లక్ష్మణుడని, ధనుర్ధరుడై అన్నా, వదినల రక్షణలో ఉన్నాడని, అతన్ని మోసగించి వారి ఆపద ఘటించే శక్తి లేదని, సీత తన సతీత్వంతో భర్తకు రక్షాకవచం కలిగించటానికే అడవులకు పోయిందని చెపుతుంది. రాముడు తప్పక ధరణిని పాలిస్తాడని తను భవిష్యత్తు చూడగలనని, అచిరకాలంలో కౌసల్య, సీతా, రామ, లక్ష్మణుల ఆలింగన సౌఖ్యం పొందగలదని ఓదారుస్తుంది.

అందరినీ ఓదార్చవలసిన కౌసల్య శోకిస్తే పతి ఓర్చుకోలేడని, పతి పశ్చాత్తాపంతో వచ్చినపుడు మనం చేయవలసినది ఆయన ప్రాణరక్ష అని పునః పునః చెపుతుంది. అలా కౌసల్య అధైర్యపడినపుడల్లా ధైర్యం చెప్పి ఓదారుస్తూ ఉంటుంది. భార్యా, భర్తలయిన ఊర్మిళా, లక్ష్మణుల వియోగం చాలా చిన్న వయసులో సంభవించినా ఊర్మిళను మహాసమాధి నిమగ్నను చేస్తుంది. సుమిత్రలాంటి త్యాగమయిని చరిత్రలో కనీవినీ ఎరుగరు.

ఇలా సుమిత్ర ఒక పేరెన్నికగల స్త్రీగా రామాయణంలో మనకి గోచరిస్తుంది. ఆమె యోగ శక్తి లక్ష్మణుని బాణాల్లో ప్రవేశించి, వానిని అప్రతిహతంగా చేస్తాయి.

## కైక

కైక దశరథుని ముద్దుల రాణి. వయసులో చిన్నది, కాని రాజ్యతంత్రంలో నేర్పరి.

ఈమె కేకయ రాజు కుమార్తె. దశరథుని ధర్మపాలనకూ, దృఢ ఆకార మనోహరతకూ, ఆవక్రవిక్రమానికి మెచ్చి, తల్లితండ్రులు వారించినా, వయోభేదం చూడక వరించి వివాహం చేసుకుంది. రూపభేదమే కాని ఆత్మభేదం లేకుండా ఆనంద సాగరంలో విహరింపచేసింది. దశరథుని రాక క్షణం అతిక్రమిస్తే నిలదీసి కారణం కనుక్కునేది. పేరుకి కౌసల్య పెద్దరాణి అయినా, కైక మహారాణిగా మన్ననలందింది.

శ్రీరామ పట్టాభిషేక వార్త విని కైక చాలా సంతోషించి మంథరకు మంచి బహుమతులిస్తుంది. రామయ్య తల్లితండ్రుల మాట కాదనగలడేమో కాని కైక మాటకాదనడని కైక చేతిలో పెరిగిన వాడని పొంగిపోతుంది. తనని తల్లిగా కాక గురువుగా భావిస్తాడని చెపుతుంది. కళ్ళల్లో పెంచిన వాడికి కష్టం కలిగించడం మంచిదికాదని, ఉన్నతవంశంలో పుట్టి, పవిత్రమైన, యశోభరితమైన వంశంలోమెట్టి రాణులందరిలో పేరుగాంచిన తాను ఈ పని చేయలేనని భావిస్తుంది. కాని కౌసల్య ప్రాభవం పెరగటం సహించలేదు.

మంథర దుర్బోధల ఫలితంగా రామవనవాసం, భరతుని పట్టాభిషేకం, తనకిచ్చిన వరాలుగా కోరుతుంది. రాజురాక ముందు స్వగతంలో తాను ప్రళయం సృష్టిస్తానని, రామాభిషేక సంభారం, భరతుని అభిషేకానికే మారుస్తాననీ, గోటితో కాగల పనికి గొడ్డలి ఉపయోగించిన రాజు పశ్చాత్తాపం చెందినా తాను లొంగననీ, ఈ అవమానానికి ప్రతీకారం చేసి తీరుతాననీ అనుకుంటుంది. తన శీలంతోపాటు వృద్ధి చెందిన ఆత్మశక్తిని లోక కళ్యాణానికోసం త్యాగం చేస్తాననుకుంటుంది. రాముడు అడవిలో ఉన్నా అయోధ్యలో ఉన్నా లోకాభిరాముడేనని, తనకు రామయ్యపై ద్వేషంగాని అసూయగాని లేవని, నమ్మించి ద్రోహం తలపెట్టిన రాజుపైనే కోపం అని అనుకుంటుంది. తనలో లేని క్రౌర్యం, కఠినతా ఇప్పుడు అరువు తెచ్చుకుని, అభినయించి, జయం సాధిస్తానని అనుకుంటుంది.

రాజు ఎన్నో విధాల ఆమెను అనునయించి ఆమె కోపకారణమడుగగా, అడిగి వ్యర్థురాలను కావడమంటే తన ఆత్మాభిమానానికి దెబ్బ అంటుంది. రామునిపై ఆన వేయగా తన వరాలను అడుగగా రాజు దూషిస్తాడు. వయఃపరిణామం చూడక, తల్లిదండ్రుల మాట వినక నిన్ను చేపట్టి మనోవాక్కాయ కర్మల్లో నిన్నారాధించి, తన, మనఃధనాలు నీకర్పించి సవతి మత్సరం విసర్జించి, నీ మమకార కుమారుణ్ణి పూలలో పెట్టి పూజించుట ప్రసవించిన పులిగుణమేనా అని దశరథుని నిందిస్తుంది. అనృత దోషపంకిలుడవయిన నీ అర్ధాంగిగా నేను జీవించలేనని ఏడుస్తుంది.

రాముని పిలిపించి 'నీవు తండ్రిమాట వంశగౌరవం నిలబెట్టుతానంటే ఆయన నాకు ఇచ్చిన వరాలేమిటో వివరిస్తానని' స్వకార్య సాధనకు పనికి వచ్చేటట్లు పలికి వనవాసానికేగమని చెపుతుంది. రాముని ఒప్పుదలతో సంతసిస్తుంది. రాముని వనవాస వార్తవిని ఎందరు ఆమెని దూషించినా భరిస్తుంది.

కొందరు కోరి ఆమెతో శతృత్వం పెట్టుకుని కొరివితో తల ఎవరు గోక్కుంటారు అని ఉదాసీనంగా ఊరుకుంటారు. రామునితో సైన్యం పంపమని అదనీ, ఇదనీ వృద్ధరాజు ప్రలాపిస్తుంటే చెడ్డదాన్ని ఎలాగూ చెడిన దాననే అని నార చీరలు సీతా రామలక్ష్మణులకిస్తుంది.

రాముడు వనవాసానికి పోయిన పిమ్మట దశరథుడు, ఆమెను, ఆమె కొడుకుని విడిచిపెట్టానని, ఆమెకు భర్త సేవలో వచ్చే ఫలం రాదని అంటే కైక దశరథునితో అన్నమాటలు ఇవి. రాజు ఇలా నిషేధించడము రెండవసారి అని, దీనికి తను ఏమీ విచారపడటం లేదని, తనకు దశరథుని ప్రాణరక్షణ వలన వచ్చే ఫలం, అతన్ని నరక కూపాన్నించి తప్పించిన ఫలముచాలని, తన ఆత్మధర్మమే తనకు సాక్షి అని శ్రుతి ధర్మమే ఆచరణీయమని, దశరథుడు తన్ను త్యజించినా తాను అతనిని త్యజించలేదని, దశరథుడు అతి సంసారలంపటుడని, అతని మనోలోకాన్ని తాను క్షాళనం చేసిందని, అతనికి ఉత్తమలోకాలు కలిపించానని చెపుతుంది. తనమూలంగా అడివికి పోయిన రాముడు జగదాభిరాముడుగా వస్తాడని చెపుతుంది. దశరథుడు అనతగిన వాడని తాను పడగినదాన్నని ఇందులో దోషాదోషాలు అతనికే వదిలివేస్తున్నానని చెపుతుంది.

భరతుని రాకతో పరమానందం పొంది కుశల ప్రశ్నలు వేస్తుంది. భరతుడు సమాధానపడక వివరంగా తెలుసుకుని తల్లిని దూషిస్తాడు. తను రాజ్యమడిగానా అన్న ప్రశ్నకు చిన్నప్పుడు పాలు అడిగావనే ఇచ్చానా అన్న బదులు ఇస్తుంది. భరతుడు దూషిస్తూవుంటే ఉసూరుమంటుంది.

కైక రాజనీతి విశారద. రాజుకు రాచకార్యాలలో సలహా సహకారాలందిస్తూ ఉండేది. రణతంత్రమర్మజ్ఞ పూర్వం శంబరాసురుడు దేవతల మీదికి దండెత్తివస్తే దేవతల సహాయార్థం దశరథుడు వెడితే, దశరథునికి తోడుగా కైక కూడా వెడుతుంది. సమర సమయంలో సాయపడినందుకు ప్రతిఫలంగా రెండు వరాలు పొందుతుంది. ఆ వరాలే శ్రీరామ వనవాసానికి బీజమయాయి. విశ్వామిత్రుడు, శ్రీరాముని మారీచ సుబాహుల మీదకి పంపమనగా, రాముని బదులు తానే వస్తానంటుంది. శ్రీరాముడు మొదట విల్లు పట్టడము ఆమె దగ్గరే నేర్చుకున్నాడు. ఆమెకు శ్రీరాముడు ప్రేమ పుత్రుడు. భరతుడు దగ్గర లేకున్నా, రామునిలో భరతుని చూచుకుంటుంది.

శ్రీరామవనవాసం ఆమె కోరడానికి కారణము దేవతలచైదము, దశరధుని దుశ్చింత. ఆమెకు మొదటే చెప్పివుంటే ఇంతరాద్ధాంతము జరిగేది కాదు.

ఆమె రాణులందరిలోకి మేలుబంతి, సౌందర్యరసాధి దేవత.

## ఊర్మిళ

ఊర్మిళ జనకుని కూతురు. లక్ష్మణుని పత్ని. ఆమెకు రామాయణంలో ఏ పాత్ర ఉంది? ఊర్మిళ అన్నపేరు తప్పు - అని చాలామందికి అనుమానం వస్తుంది. అది ఒకవిధంగా నిజమయినప్పటికీ రామాయణం కొంచెం లోతుగా చదివిన వారికి ఆమె పాత్రగోచరిస్తుంది.

సీతా, రాములు వనవాసం వెళ్ళేటప్పుడు లక్ష్మణుడు తల్లి అనుమతితో వారిని అనుసరిస్తాడు. ఊర్మిళ కూడా వీరితో వనవాసానికి వెడితే లక్ష్మణుని లక్ష్యం బహుముఖీనమవుతుంది అని ఆమెని నిషేధిస్తాడు. మరి ఆమె ఏం చేయాలి? ఇక్కడ కూడా రెండు విధాల చెపుతారు.

జానపదులు 'ఊర్మిళ నిద్ర' అని జానపదగీతంలో ఆమె ఈ పదునాలుగేళ్ళు దీర్ఘనిద్రలో ఉందని, బాహ్యస్పృహ లేదని, లక్షణుడు వచ్చిలేపితే ఎవరో పరపురుషుడు అనుకుంటుందనీ రకరకాల కవిత్వాలు కడుతారు.

నాగరీకులు ఆమె మహాతపస్సమాధిలో భర్త, బావ, అక్కల క్షేమం కోరిందని, లక్ష్మణునకు అత్యంత కోపం వచ్చే సమయంలో, సూక్ష్మరూపంలో ఆమె అతనిని అనునయించేదని ఆమె అంతఃతపశ్చర్యయే లక్షణుని కాపాడిందని చెపుతారు. నిద్రావస్థో, లేక తపఃశ్చర్యో ఆమె బాహ్యస్మృతిలో లేదన్నది నిశ్చయము. అలా పదునాలుగేండ్లు గడిపి లక్ష్మణుని రాకకు ఒక యుగముగా గడిపిన ఆమెని లక్ష్మణుడు వచ్చిన వెంటనే ఆదరించక, అన్నగారి అనుమతిగొని, తరువాత ఎప్పుడో ఆదరించినా సైరించిన అభిమానవతి.

ఆమె వెలిబుచ్చిన అభిప్రాయాలు పొల్లుపోనివని రాణివాసంలో అందరి అభిప్రాయం. సత్యమేపలికే ఆమె. అందరి మనోభిప్రాయాలు తెలుసుకుని ఆవిధంగా తన నడతను మలుచుకుంది. మహాతపశ్శాలి. పొల్లు మాటలు పలకనిది. స్నేహ పాత్రురాలు.

(ఇంకావుంది)



శ్రీమతి ప్రమీలా చంద్రమోహన్ గారు , ఎమెస్కో పబ్లికేషన్స్ స్థాపకులు శ్రీ ఎమ్.ఎన్. రావు గారి పెద్దకుమార్తె.
భర్త , రిటైర్డ్ ప్రొఫెసర్, శ్రీ చంద్రమోహన్ గారితో తిరుపతిలో నివాసం.